# సర్కారు బడి.. సరికొత్త ఒరవడి



కామారెడ్డి/ ఖలీల్‌వాడి, జూన్ 19: స్వరాష్ట్రంలో సర్కారు విద్యాసంస్థలు కార్పొరేట్ స్థాయికి చేరాయి. గత ప్రభుత్వాల హయాంలో కనీస మరమ్మతులకు సైతం నోచుకోని పాఠశాలలు, వసతి గృహాలు... ప్రస్తుతం సకల సౌకర్యాలతో కళకళలాడుతున్నాయి. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దింది. రూ.కోట్లు వెచ్చించి వాటిని అధునాతనంగా మారుస్తున్నది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. సర్కారు బడుల్లో ఇంగ్లిష్ చదువులు అందుబాటులోకి రావడంతో పేద విద్యార్థులకు ఎంతగానో మేలు చేకూరింది. కార్పొరేట్ చదువులు చదవాలనే ఆకాంక్షతో ప్రైవేట్ పాఠశాలలో రూ.లక్షలు వెచ్చించి ఇబ్బందిపడ్డ మధ్యతరగతి, పేద విద్యార్థులకు ఎంతో ఊరటనిస్తున్నది. కార్పొరేట్ విద్యాసంస్థల్లో అందించే సౌకర్యాలను ఉచితంగా కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నది. అత్యుత్తమ విద్య, మేలైన సౌకర్యాలు, పౌష్టికాహారం అన్నీ కలిపి వసతిగృహాల్లో విద్య, వసతితో భళా అనిపించేలా ప్రభుత్వం ముందడుగు వేస్తున్నది. ప్రభుత్వ హాస్టళ్లలో వసతి సౌకర్యాలు రోజురోజుకూ మెరుగవుతున్నాయి. అధునాతన సదుపాయాలతో విద్యార్థులకు సకలం అందిస్తుండడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఆర్థిక స్థోమత లేని వారంతా పుస్తకాలు, దుస్తులు, బూట్లు, మంచం, పరుపు, దిండు వంటి కార్పొరేట్ స్థాయి సదుపాయాలను పొందడం కలగానే ఉండగా... ఇప్పుడదీ నిజమవుతున్నది. సర్కారు బడి అంటేనే చిన్నచూపు చూసే స్థాయి నుంచి ప్రభుత్వ పాఠశాలే మంచిదనే ఆలోచనకు వస్తున్నారు పలువురు తల్లిదండ్రులు. తెలంగాణ సర్కారు పాఠశాలల్లో సకల వసతులు కల్పించడంతో ప్రైవేటును మరిపిస్తున్నాయి. విద్యాబోధనలోనూ ఇతర పాఠశాలలకు పోటీగా నిలుస్తున్నాయి. విద్యా, క్రీడా, సాంస్కృతిక, సైన్స్ ఫెయిర్ తదితర విభాగాల్లోను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణిస్తున్నారు.

## కామారెడ్డిలో 1011 పాఠశాలలు..

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు 1011 ఉండగా ఇందులో 696 ప్రాథమిక,126 ప్రాథమికోన్నత,189 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. కేజీబీవీలు 19, మోడల్ స్కూల్ 6, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (నేతాజి సుభాష్ చంద్రబోస్ విద్యాలయం) 1, తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సొసైటీ 1, ఎయిడెడ్ 5, సోషల్ వెల్ఫేర్ 11, మైనార్టీ వెల్ఫేర్ 6, బీసీ వెల్ఫేర్ (మహాత్మాగాంధీ జ్యోతి బాపూలే) 7, ట్రైబల్ వెల్ఫేర్ 3, గిరిజన ఆశ్రమ పాఠశాలలు 4 ఉన్నాయి.

## నిజామాబాద్ జిల్లాలో..

ప్రైమరీ స్కూళ్లు - 770
అప్పర్ ప్రైమరీ స్కూళ్లు -133
ఉన్నత పాఠశాలలు - 255
కేజీబీవీ - 25
టీఎస్ మోడల్ స్కూళ్లు - 10
టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ స్కూళ్లు - 3
మైనార్టీ వెల్ఫేర్ స్కూళ్లు -17
ఎంజేపీటీ స్కూళ్లు - 13
సోషల్ వెల్ఫేర్ స్కూళ్లు - 9
ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లు -2
టీఎస్‌ఈఎంఆర్‌ఎస్ స్కూళ్లు -1
ఆశ్రమ పాఠశాలలు -2

## కొండంత భరోసా..

ప్రభుత్వ హాస్టళ్లలో చేరే విద్యార్థులకు కొండంత భరోసానిస్తున్నది రాష్ట్ర ప్రభుత్వం. నాణ్యమైన విద్యను అందించడంతోపాటు పౌష్టికాహారం పెడుతుండడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు నెలకు నాలుగు సార్లు చికెన్ వండి పెడుతున్నారు. ప్రతి రోజూ గుడ్డు వడ్డిస్తున్నారు. సాయంత్రం స్నాక్స్ ఇలా పోషకాహారాన్ని అందిస్తున్నది.





- స్వరాష్ట్రంలో అందరికీ నాణ్యమైన విద్య
- కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సర్కారు బడులు
- ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమ బోధన అమలు
- సర్కారు వసతి గృహాలకు పెరుగుతున్న డిమాండ్
- మన ఊరు-మన బడితో మారిన పాఠశాలల రూపురేఖలు
- పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల దరికి కార్పొరేట్ విద్య
- సన్నబియ్యంతో కూడిన పౌష్టికాహారం
- తొమ్మిదేండ్లలో బలోపేతమైన సర్కారు విద్య
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు విద్యా దినోత్సవం

కామారెడ్డిలోని దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాల



నిజామాబాద్‌లోని పోలీస్ లైన్ పాఠశాల



నిజామాబాద్ జిల్లా గూపన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్మించిన వాష్‌బేషిన్లు

## కార్పొరేట్‌కు దీటుగా..

తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా మారాయి. ప్రైవేటు పాఠశాలల్లో ఉండే అనేక రకాల వసతులతో సమానంగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయి. మనఊరు– మన బడి కార్యక్రమంతో జిల్లా వ్యాప్తంగా 351 పాఠశాలల రూపురేఖలు మారా యి. విశాలమైన తరగతి గదులు, డైనింగ్ హాల్, మైదానంతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాం.

**- రాజు, డీఈవో, కామారెడ్డి**

## 'మనబడి' మరింత మెరుగు

వరండా, చెట్ల కింద విద్యాబోధనకు కాలం చెల్లింది. తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాల లేమి వంటి అవస్థలు దూరమవుతున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో అన్ని రకాల మౌలిక వసతులు సమకూరుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మనఊరు–మనబడి, మన బస్తీ – మనబడి కార్యక్రమంతో సర్కారు స్కూళ్లకు మహర్దశ పట్టింది. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 351 పాఠశాలలను మనఊరు – మనబడి కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఇందులో ప్రైమరీ పాఠశాలలు 186, అప్పర్ ప్రైమరీ 41, హైస్కూళ్లు 186 ఉన్నాయి. అత్యాధునిక బెంచీలు, గ్రీన్ చాక్‌బోర్డులు, విద్యుద్దీపాల వెలుగులు, ఆహ్లాదాన్ని పంచే ప్రాంగణాలు, అదనపు తరగతి గదులు, వంటశాలలు, వాష్‌బేషిన్లు, కంప్యూటర్ ల్యాబ్‌లు,సైన్స్ ప్రాజెక్ట్ ల్యాబ్‌లు,గ్రంథాలయం, తాగునీరు, చదువుపై ఆసక్తిని పెంచేలా పెయింటింగ్‌తో కూడిన ప్రహరీలు, టాయిలెట్స్, డైనింగ్ హాళ్లతో ప్రభుత్వ బడులు భళా అనేలా మారాయి. మొత్తానికి సర్కారు పాఠశాలలు నూతన ఒరవడిని సంతరించుకుంటున్నాయి.







కామారెడ్డి జిల్లా దేవునిపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)





నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పడగల్ ప్రైమరీ పాఠశాల

# ఊరూరా హరితోత్సవం

- పండుగలా హరితహారం
- మొక్కలు నాటిన స్పీకర్ పోచారం, ఎమ్మెల్యేలు, అధికారులు

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో హరితోత్సవం నిర్వహించారు. నియోజకవర్గాల్లో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్, ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్‌షిండే, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మహ్మద్ షకీల్, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రారంభించిన హరితహారంతో కలిగిన ప్రయోజనాలను అధికారులు వివరించారు.



నిజాంసాగర్ మండలం మంగ్లూర్‌లో మొక్కనాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే షిండే, ఎంపీ బీబీపాటిల్, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్



ఇందల్వాయి సెంట్రల్ నర్సరీలో మొక్కను నాటి నీరు పోస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్



బోధన్‌లో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే షకీల్



మాక్లూర్ మండలం చిన్నాపూర్ అర్బన్ పార్కులో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



భిక్కనూర్ మండలం కంచర్లలో మొక్కను నాటుతున్న విప్ గంప గోవర్ధన్



నాగిరెడ్డిపేట మండలం బంజార తండాలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్



పోచంపాడ్‌లో సంపదవనాన్ని ప్రారంభించి మొక్కకు నీళ్లు పోస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు